ప్రజాశక్తి

బుధవారం 2 జులై 2025 | 8 పేజీలు





ప్రకాశం | బాపట్ల

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు..

కలెక్టర్ తమీమ్అన్సారియా



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-మద్దిపాడు

రైతులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం గార్లపాడు గ్రామంలో గల పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు ▶ 2లో

నేటి నుంచి ఇంటింటికే..

- 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో కార్యక్రమం..
- మేనిఫెస్టోపై ఎమ్మెల్యేలను నిలదీయాలని పిలుపునిచ్చిన వైసిపి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మంత్రి గానీ, ఎమ్మెల్యే గానీ కూటమి నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులు అందరూ ఇప్పుడు ఇంటింటికీ తిరగాల్సిందే.. తెలుగు దేశం నుంచి గెలిచిన ఎమ్మెల్యేలందరూ ఇప్పుడు విధిగా ప్రజల ఇళ్లకు వెళ్లాలి. 'సుపరిపాలనలో తొలి అడుగు..' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం బుధవారం నుంచి నెల రోజుల పాటు జరగనుంది. అన్ని గ్రామాల్లో అన్ని ఇళ్లకూ తిరగాలి. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికను కూటమిలోని మిగతాపార్టీలను కలుపుకొని ఖరారు చేసుకున్నారు. రెండ్రోజుల క్రితం సిఎం చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఏడాది పాలన ముగిసిన నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇంటింటికీ తిరిగి జనం సమస్యలు తెలుసుకోవడం, వాటిని పరిష్కారం చేయడం, ప్రజలకు అందుబాటులో ఉండటం వంటివి ప్రధాన కర్తవ్యాలుగా నిర్ణయించారు. మంగళవారం నాడు మంత్రులు ఇద్దరితో పాటు ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగి వృద్ధులకు పెన్షన్ల సొమ్ము పంపిణీ చేశారు. నెలనెలా ఏడాదిగా సాగుతోంది. ఇప్పుడు ఏడాదిలో ఏం చేశామన్నది జనానికి చెప్పడానికి వెళుతున్నారు. చేయలేకపోతే ఎందుకు చేయలేకపోయామనే విషయాన్ని కూడా జనానికి చెప్పాలని సిఎం చంద్రబాబు నిర్దేశించారు. గతంలో వైసిపి గడపగడపకూ పేరుతో ఎమ్మెల్యేలను ఇళ్లకు తిప్పింది. అప్పుడు చాలా మంది ▶ 2లో



పింఛన్ అందజేస్తున్న మంత్రి స్వామి

సంక్షోభంలోనూ మెరుగైన సంక్షేమం

మంత్రి స్వామి 3లో ▶

4న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పర్యటన

5లో ▶



ప్రజాశక్తి ప్రచురించిన డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ విజయమ్మ

ప్రజాభిమానాన్ని చూరగొంటున్న 'ప్రజాశక్తి'

డిఎంహెచ్ఒ విజయమ్మ 5లో ▶

నేటి నుంచి ఇంటింటికీ..

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులకు ఆ కార్యక్రమం ఇబ్బందిగా మారినా తప్పలేదు. ఎవరెన్ని రోజులు తిరిగారనే లెక్కలూ తీశారు. ఇప్పుడూ ఇదే ఎజెండా. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరగనున్నారు. తొలి రోజున మంత్రి గొట్టిపాటి రవికుమార్ బల్లికురవ మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మంత్రి డోలా వీరాంజనేయస్వామి గోగినేనివారిపాలెంలో ఇంటింటికీ కార్యక్రమం మొదలుపెట్టనున్నారు. ఇక ఎమ్మెల్యేలు అందరూ తమ నియోజక వర్గాల్లో ఇప్పుడు నెల రోజుల పాటు తిరిగే కార్యక్రమంపై ఏర్పాట్లలో ఉన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మంగళవారం ఉదయం కూటమి నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి.. ఇంటింటికీ కార్యక్ర మంపై మాట్లాడారు. గ్రామాల్లోకి వెళ్లి ఇంటింటికీ తిరగడం ఇప్పుడు కొంత సాహసంగానే ఉంది. ఎందుకంటే ఎన్నికల మేనిఫెస్టో అమలులోకి రాలేదు. ఇప్పటివరకూ రెండు పథకాలే ఆచరణలోకి వచ్చాయి. గ్యాస్ సిలిండర్ల పథకంపై ఎక్కడా స్పందన రాలేదు. తల్లికి వందనం కింద మొన్ననే ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఇదొక్కటే ఇప్పుడు ఇంటింటికీ వెళ్లడానికి కొంత ఊరట కలిగించింది. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం మహిళలు అందరూ ఎదురుచూస్తున్నారు. వీటిపైనే ఇప్పుడు పాలకపక్ష నేతలు ఇరకాటంలో ఉన్నారు. వీటిపై మహిళలు ప్రశ్నిస్తే ఏం చెప్పాలన్నదే సంకటంగా మారింది. మరోవైపు మేనిఫెస్టోపై జనం నిలదీయాలని వైసిపి పిలుపునిచ్చింది. ఏడాదిలో సిఎం చంద్రబాబు మోసాలు చేశారంటూ వైసిపి పెద్దఎత్తున ఎదురుదాడికి దిగుతోంది. చంద్రబాబు తమ పార్టీ నేతలను ఇంటింటికీ తిప్పి ఏం చెప్పాలని నిర్దేశించారో అవన్నీ బూటకాలంటూ వైసిపి నేతలు కూడా ప్రచారం తీవ్రతరం చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ విస్తృత స్థాయి సమావేశం కూడా నిర్వహించి కూటమిపై ప్రచారానికి ప్రణాళికలు రూపొందించారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఏడాది పాలనపై పార్టీలపరంగా దుమారం రేగుతోంది. ఇక ఎన్నికల సందర్భంగా నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు ఏమీ ముందుకు సాగలేదు. ఎందుకంటే నిధుల్లేక పనులు పెద్దగా మొదలుకాలేదు. కొన్ని రహదారులు మరమ్మతులు చేశారు. సంక్షేమ ఎజండా ఊపుగా లేదనే చర్చ ఉంది. దానికి తోడు అభివృద్ధి ఎజెండా మొదలైందా? అనే సంశయనం కలిగే పరిస్థితి వచ్చింది. ఎందుకంటే అన్నింటికీ నిధులే ఆటంకం. వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీలు రాలేదు. తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఉన్నాయి. పట్టణాల్లో డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, రహదారులు విస్తరణలు లేవు. టిడ్కో ఇళ్లు అప్పగించలేదు. పేదలకు రెండు సెంట్లు స్థలం ఎక్కడా అమలు కాలేదు. ఏడాది క్రితం ఒంగోలులో ఇచ్చిన పట్టాలు పరిస్థితి ఏమిటన్నదీ స్పష్టత లేదు. ఎమ్మెల్యేలు సిఎం చంద్రబాబును కలిసి పనులు, సమస్యలపై విన్నపాలు చేస్తున్నారు. నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. ఆయన్నుంచి స్పందన లేదు. ఇప్పుడు ప్రజలకు ఏం చెప్పాలన్నదే కూటమి నేతల ముందున్న సమస్య. కార్యక్రమం ఎజెండా మంచిదే. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం పనితీరు కూడా ఉండాలనే భావన కూడా ఉంది. హామీల అమలుపై నీళ్లు నమలక తప్పదు. సమస్యల పరిష్కారం ఏ మేరకు ఉంటుందో చూడాలి. గ్రామాల్లోకి వెళుతున్నందున ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యేలున్నట్లే.. అన్నీ ఇప్పుడు భవిష్యత్‌కు సవాళ్లుగా మారాయి.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు విధానాన్ని గురించి పొగాకు రైతులు, మార్క్‌ఫెడ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం

గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం అమలుపై కలెక్టర్ సంతప్తిని వ్యక్తం చేస్తూ ప్రతిరోజు ఇలాగే ఉంటుందా? సన్న బియ్యంతో భోజనం ఎలా ఉంది.? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గతంలో కంటే మెనూ మార్చిన తర్వాత ఇప్పుడు బాగా ఉందని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. వారానికి ఒకసారి మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించాలని తహశీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రేషన్ షాపును సందర్శించారు. రేషన్ షాపు వెరిఫికేషన్, ఆన్లైన్ ప్రక్రియ, సరఫరా చేసిన స్టాక్‌ను స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ డిఎం హరికష్ణ, మద్దిపాడు తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఓ ప్రసాద్, ఏవో స్వర్ణలత పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల కౌలు వేలం

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా లోని వక్స్ బోర్డు భూములను 2025-28 సంవత్సరాలకు (మూడు సంవత్సరములకు) పంట పండించుటకు కౌలుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖాధికారి జె పార్థసారధి మంగళవారం నాడు ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ, వక్స్ బోర్డు ఆదీనంలోని నాగులుప్పలపాడు సర్వే నెం:80 లోని య 6.50 సెంట్లు మరియు టంగుటూరు మండలము, యం. నిడమానూరు లోని సర్వే నెం: 354 లోని య 11.36 సెంట్లు వక్స్ భూములు జులై 8 న ఉదయం 10.30 గంటలకు మరియు మద్యానం 2.30 గంటల నుండి అల్లూరు లోని సర్వే నెం:398 లోని య 13.50 సెంట్లు మరియు త్రోవగుంటలోని సర్వే నెం: 327 లోని య 10.93 సెంట్లు %డ% సర్వే నెం: 207 లోని య 49.07 సెంట్లు వక్స్ భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం కార్యక్రమం ప్రకాశం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, ఒంగోలు వారి కార్యాలయము లో నిర్వహించబడునని తెలిపారు. వేలంపాట లో పాల్గొన దలచిన వారు తమ వివరాలతో పాటు ముందస్తుగా రూ.10,000/- లు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవలసినదిగా చెప్పారు.వివరాలకు పాత రిమ్స్‌లోని మైనారిటీల సంక్షేమ అధికారి వారి కార్యాలయములో లేదా ఫోను ద్వారా 7093472086, 7331157343 నంబర్లలో సంప్రదించవలసింది గా కోరారు.

సమ్మెకు సంఘీభావంగా నేడు ఉద్యోగుల సదస్సు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక, పెన్షనర్ల కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ వర్గాల సమస్యల పరిష్కారం కోసం బుధవారం నాడు సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జీ శేషయ్య,సిహెచ్ రాంబాబు మంగళవారం నాడు తెలిపారు. ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు సదస్సు జరుగుతుందని ఈ సదస్సుకు శాసనమండలి మాజీ సభ్యులు కేస్ లక్ష్మణరావు ముఖ్య వక్తగా పాల్గొంటున్నట్లు వారు పేర్కొన్నారు. సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం జరిగే అవగాహన సదస్సులో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సదస్సులో వివిధ రంగాల ఉద్యోగ, కార్మికులు,ఔట్ సోర్స్, కాంట్రాక్ట్, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులతో పాటు పెన్షనర్లు పాల్గొని సదస్సు జయప్రదం చేయాలని వారుకోరారు.

చదువుతో పాటు ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలి

డాక్టర్ కే శ్రీధర్ బాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్ బాబు

విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ చూపాలని మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు, డాక్టర్ కె.శ్రీధర్ బాబు అన్నారు. డాక్టర్స్ డేని వ ్ర ర న ్ క రి ం చ ు క ు ని మంగళవారం ఒంగోలు రామ్ నగర్‌లోని భాష్యం హైస్కూల్ లో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌బాబు విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానం గురించి విద్యార్దులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఇటువంటి విషయాల పట్ల అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం అన్నారు. నేటి సమాజంలో గుండె జబ్బులు ఎక్కువగా వస్తున్నాయని, అత్యవసర సమయాలలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని సూచించారు. రామ్ నగర్ భాష్యం హైస్కూల్ ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలితో ఇటీవల కాలంలో యువత ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ విద్యార్దులకు వివరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకల్లో డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ కె.రవళి పాల్గొని విద్యార్దులకు ఎంతో విలువైన ఆరోగ్య సూచనలు ఇచ్చారన్నారు. అలాగే, డాక్టర్స్ డే సందర్భంగా రామ్ నగర్ భాష్యం లిటిల్ ఛాంప్స్ పాఠశాలలో కూడా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గాంధీ డెంటల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పరిమళలు విద్యార్దులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. జోనల్ ఇన్ చార్జ్ శ్రీ కృష్ణ గణేష్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్, జెడ్ సీఓ సుశీల, పాల్గొన్నారు.

వైపాలెంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో స్మార్ట్ ఎనర్జీ సేఫ్ నేషన్ నినాదంతో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యర్రగొండపాలెం పట్టణంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎఇ తలపాటి అల్లూరయ్య మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాలుపంచుకోవాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించడం, విద్యుత్ ప్రమాదాలను తగ్గించడమే ఈ వారోత్సవాల లక్ష్యం అని అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ ఎనర్జీ సేఫ్ నేషన్ నినాదంతో వీటిలో భాగంగా అధునాతన సాంకేతిక బ్యాటరీ, ఎనర్జీ స్టోరేజ్ సిస్టం, ఎలక్ట్రికల్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్లు, రూఫ్ టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ సంబంధించి భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుందని, ఎండల నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వంటి ఎలక్ట్రికల్ గృహోపకరణాల వాడకం అధికమైందని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించి విలువైన ఆస్తి, ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌కు కారణాలు, నివారణ చర్యలకు ఆయన వివరించారు. లోడుకు తగినట్టు కాకుండా తక్కువ గేజ్ విద్యుత్ వైర్లను వినియోగించడం, నాణ్యతలేని తక్కువ గేజ్ వైర్లను వాడటం విద్యుత్ ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. తగిన సామర్థ్యం లేని వైర్లతో ఏసీలు, హీటర్లు వంటివి వాడరాదన్నారు. వైర్ల సామర్థ్యానికి మించి ఎంసీబీ, ఎంసీసీబీలను బిగించటం, ఎర్త్ వైర్ల ఫేజ్ వైరు కన్నా చిన్నది వాడటం, ఎర్త్ పిట్ లేకపోవడం, ఉన్నా నిర్వహణ సరిగా లేకపోవటం, 25 ఏళ్లు దాటిన తర్వాత విద్యుత్ వైర్లు, ఎంసీబీ, ఎంసీసీ బీలను మార్చకపోవడం తదితరాలను నివారించాలన్నారు. తడి చేతులతో స్విచ్ ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జేఏవో మల్లికార్జున, లైన్ ఇన్‌స్పెక్టర్ కె గురవయ్య, లైన్‌మెన్‌లు కోటా ప్రకాశం, జోన్, పీటర్‌తో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

ఈ నెల 9వ తేదీన జరుగనున్న జాతీయ సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొంటున్నట్లు తెలియపరుస్తూ గిద్దలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం యుడిసి జాకీర్ హుస్సేన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి స్వర్ణకుమారి, మున్నా మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేకూర్చే కార్మిక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయడానికి సరిపడా నిధులు బడ్జెట్లో కేటాయించాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రిటైర్ అయిన అంగన్‌వాడీ వర్కర్‌కు పెన్షన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీన గిద్దలూరు ప్రాజెక్టులో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అందరూ సమ్మె చేస్తున్నామన్నారు.

ప్రజాశ్రేయస్సులో ప్రజాశక్తి పాత్ర ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న ఉపాస్ వైద్యులు, సిబ్బంది

ప్రజాశ్రేయస్సులో ప్రజాశక్తి పాత్ర ప్రశంసనీయమని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ డైరెక్టర్లు డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కె అనిల్ కుమార్, డాక్టర్ జి ఉమాపతి చౌదరి, డాక్టర్ అనపర్తి శ్రీనివాస రావు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను వారు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రాధాన్యతతో పాటు పలు వ్యాధులపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, వైద్య సేవల గురించి పలు కథనాలు ప్రజాశక్తి లో విశ్లేషించడం పట్ల ప్రజాశక్తి సిబ్బందికి, అభినందనలు తెలిపారు. డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు అత్యాధునిక వైద్యం పొందాలంటే హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు పరుగులు పెట్టవలసి వచ్చేదని గుర్తు చేశారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యం జీవితంలో ఒక భాగంగా పరిణమించినట్లు తెలిపారు. జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా శారీరక రుగ్మతలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజాశక్తి పలు సందర్భాల్లో అటువంటి అవగాహన కల్పించే కథనాలను అందించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పోకూరి శ్రీనివాసరావు, ఫిజీషియన్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ చివుకుల శ్రీధర్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జయవర్ధన్, గైనకాలజిస్ట్ డాక్టర్ రాధ, యూరాలజిస్ట్ డాక్టర్ పవన్ కుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ కె సువర్ణరాజు, జనరల్ మేనేజర్ బివిన్ ఆనంద్‌కుమార్ ప్రజాశక్తి సిబ్బంది ఎం వివేకానంద, ఎ సువర్ణరాజు, ఎస్ సురేష్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పొగాకు సాగు తగ్గించుకోవాలి

ప్రజాశక్తి-తర్లుపాడు.

మండలంలోని తాడివారిపల్లి, మంగళ గుంట గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పి. జోష్టదేవి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోష్ట దేవి మాట్లాడుతూ రైతులు పొగాకు పంట సాగు విస్తీర్ణం తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరం ప్రభుత్వం వారు పొగాకు సాగు తగ్గించే విధంగా వ్యవసాయ శాఖ మరియు టొబాక బోర్డు వారి సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించినప్పటికీ అధిక విస్తీర్ణంలో పొగాకు సాగుచేసిన రైతులు పంట అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. రైతులందరూ వాణిజ్య పంటలు తగ్గించాలని, మెట్ట పంటలైన కంది, మినుము,పెసర, సజ్జ, జొన్న,నువ్వులు, కొర్ర సాగు చేసుకోవాలని తెలిపారు. ఈ పంటలు సాగు చేయటం వలన తక్కువ పెట్టుబడి, శ్రమతో అధిక దిగుబడులు పొందవచ్చు అని తెలియజేశారు. అదే సమయంలో ప్రభుత్వం వారు ప్రకటించే కనీసం మద్దతు ధరలకు సకాలంలో అమ్ముకోవచ్చు అన్నారు. తెగుళ్ల వ్యాప్తి తగ్గుతాయని వివరించారు.

డెంగీ నివారణపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం

డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మలేరియా మార్కాపురం సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్ నాగేంద్రరెడ్డి అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా మార్కాపురంలో మంగళవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ డెంగీ వ్యాధికి దోమలే కారణమన్నారు. దోమపోటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురికి నీటి కాల్వల్లో దోమల ఉత్పత్తి తగ్గించేందుకు కిరోసిన్ చల్లాలన్నారు. దోమల మందు పిచికారీ చేసుకోవడం ద్వారా దోమపోటు ఉండదన్నారు. డెంగీ జ్వరానికి సరియైన పద్ధతిలో చికిత్స అవసరమన్నారు. వైద్యం పొందడంలో జాప్యం తగదన్నారు.

కౌలు రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కౌలు రైతులకు 'పంట సాగు హక్కు పత్రం' జారీపై శిక్షణ నిర్వహించారు. మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి సూచనలు తెలిపారు. 2025-26వ సంవత్సరానికి కొమరోలు మండలానికి 1074 కౌలు కార్డులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 343 కార్డులు మాత్రమే జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె శిరీష, పి కౌసర్, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

మంగళవారం గిద్దలూరు పట్టణంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గిద్దలూరు సబ్ డివిజన్ ఏడిఈ బివై శేషగిరిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఈ బివై శేషగిరిరావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేసుకోకుండా, సిబ్బందికి సమాచారం అందించాలని వినియోగదారులను కోరారు. విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించాలని సూచించారు. అనంతరం పట్టణంలని స్థానిక విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, రైల్వే స్టేషన్ మీదుగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఈ నారాయణరెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్ మ్యాన్లు, జూనియర్ లైన్ మ్యాన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యక్తిగత శుభ్రత అనేది ఆరోగ్యానికి మూలాధారం మాత్రమే కాదు, మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన అంశం అని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం ఆ పాఠశాలలో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత పట్ల గ్రామీణ వైద్యులు సంక్షేమ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు షేక్ వలిసాహెబ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వలిసాహెబ్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే శుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడం వల్ల జీవితాంతం ఆరోగ్యవంతమైన జీవనశైలి రూపొందు తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ స్నానం చేయడం, శరీరాన్ని శుభ్రంగా ఉంచడం, చేతులను భోజనం ముందు, తర్వాత కడగడం, గోళ్లను కత్తిరించడం, దుస్తులను శుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లు తప్పక పాటించాలన్నారు.



మాట్లాడుతున్న మార్కాపురం డిఎస్‌పి నాగరాజు

అత్యాచార ఘటనలో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటనలో మంగళవారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ నాగరాజు మీడియాకు తెలిపారు. అత్యాచారానికి సహకరించిన వారిలో మహిళ కూడా ఉందని డీఎస్పీ అన్నారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అత్యాచారం చేసిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల

పింఛనులో అడుగు ముందుకే: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా.. పింఛను విషయంలో అడుగు ముందుకే అని ముఖ్యమంత్రి చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛను పెంపుతో హర్షిస్తున్నారన్నారు. స్థానిక 13వ వార్డులో మంగళవారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో ఇంతటి పెంపు లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, టిడిపి నాయకులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, మాలపాటి వెంకటరెడ్డి, షేక్ మౌలాలి, తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

పెన్షన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గిద్దలూరు

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము ఒకేసారి పెంచి అందిస్తూ ప్రతి నెల 1న టంచనుగా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో జరిగిన పెన్షన్ల పంపిణీలో పింఛన్ నగదును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కమిషనర్ ఈవీ రమణబాబు, తహశీల్దార్ ఎం ఆంజనేయరెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి, బిల్లా రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

డాక్టర్స్ డే సంచిక ఆవిష్కరణ

ప్రజాశకి - రేపల్లె

డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి' ముద్రించిన డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను వైష్ణవి నర్సింగ్ హెూం డాక్టర్ ఎవి సుబ్బారావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా 44ఏళ్లుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడం, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ప్రజాశక్తి తెలుగు దినపత్రిక డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను అభినందిస్తూ ప్రత్యేక సంచిక తీసుకురావడం, అందులో ప్రజారోగ్యానికి సంబంధించి నిపుణులైన వైద్యుల సలహాలు, సూచనలతో ప్రత్యేక కథనాలను ప్రచురించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైష్ణవి, నరసింహం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

9న జాతీయ సార్వత్రిక సమ్మె

ప్రజాశక్తి - అద్దంకి

దేశంలో పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక వర్గాన్ని ఆధునిక బానిస వర్గంగా మార్చుతున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ జులై 9న జరిగే జాతీయ సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఏఐటియుసి నాయకులు కెఎల్డి ప్రసాద్ కోరారు. పట్టణంలోని బ్యాంకులు, ఎల్ఐసి కార్యాలయాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. మోడీ ప్రభుత్వం విద్యుత్తు, రవాణా, బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఉక్కు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీ కరిస్తుందని అన్నారు. తద్వారా ప్రజలు కూడ బెట్టిన సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టి దేశంలో శతకోటేశ్వర్ల సంఖ్య పెరిగేలా ఆర్థిక విధానాలను రూపొంది స్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా 10 గంటల వరకు పనిగంటలు పెంచారని, దీనివలన నిరుద్యోగం పెరిగి ఉపాధి కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసిఇయు కార్యదర్శి జె శివ నాయక్, అధ్యక్షులు కె వినీత్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, ఎఐఐ నాయకులు రాంకోటిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

చీరాల : కార్మికుల హక్కులు కాలరాసే విధంగా ప్రభుత్వాలు తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జాతీయ సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు కోరారు. స్థానిక ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యాలయంలో కె వీరాంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి సురేష్, కూరపాటి పోతురాజు, ఆనందు, నాగమ్మ పాల్గొన్నారు.

సిపిఎం నేత 'కొరటాల'కు ఘన నివాళి



కొరటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగయ్య, నాయకులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 19వ వర్ధంతి సందర్భంగా అద్దేపల్లిలో కొరటాల చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో జన్మించారని అన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమాల పట్ల ఆకర్షతుడై సమ సమాజం స్థాపన కొరకు, కష్టజీవులు, కార్మికులు, పేదలు, చేనేత కార్మికుల సమస్యలపై పనిచేశారని కొనియాడారు. ఈ క్రమంలోనే రేపల్లె ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. లంక భూముల్లో దళితులకు భూములు ఇప్పించారని చెప్పారు. కమ్యూనిస్టులు ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ముందుంటారని అన్నారు. నేడు ప్రభుత్వాలు పేదలకు కనీస అవసరాలు తీర్చడానికి ముందుకు రావడం లేదని, సంక్షేమ పథకాల పేరుతో రూ.10 ఇచ్చినట్టు ఇస్తూ నిత్యవసర సరుకుల ధరలు, మద్యం ధరలు పెంచి పేదల నుంచి రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. ఫలితంగా ఈ రోజు పేదలు అప్పులు చేస్తూ కుటుంబాలు పోషించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటి నుండి బయటపడాలంటే కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తేనే పేదల బ్రతుకులు మెరుగవుతాయని అన్నారు. ఈ ప్రాంతంలో సిపిఎం చేసే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని, సిపిఎంను ఆదరించాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటి సభ్యులు టి కృష్ణమోహన్, వేములపల్లి వెంకటరామయ్య, రామస్వామి, ఎం నారాయణ, గోళ్ళ నాగరాజు, పి మనోజ్ కుమార్, పప్పుల అహరోను పాల్గొన్నారు.

రేపల్లె : సిపిఎం అగ్ర నాయకులు, రేపల్లె మాజీ శాసన సభ్యులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 19వ వర్ధతి సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయ కొరటాల మిట్టింగ్ హాల్లో కొరటాల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూలి విద్యార్థి దశలోనే ఉద్యమాల్లో పాల్గొన్న నేత కొరటాల సత్యనారాయణ అన్నారు. సీపీఎం పాత రేపల్లె డివిజన్ నాయకులుగా, కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా అంచెలంచెలుగా ఎదిగిన ప్రజానాయకుడని అన్నారు. రేపల్లె ఏరియాలో చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరగని కృషి చేశారని అన్నారు. చేనేత కార్మికులు కొరటాలను తమవాడిగా చెప్పుకునేవారని అన్నారు. లంక భూముల సమస్యపై నిరంతరం పోరాటాలు నడిపి పేద ప్రజలను సొసైటీలుగా ఏర్పాటు చేసి భూస్వాముల అధీనంలో ఉన్న లంక భూములను పేదలు సాగు చేసుకునేందుకు పోరాటాల ద్వారా సాధ్యం చేశారని అన్నారు. గుంటూరు జిల్లాలో రైతాంగ ఉద్యమ నాయకులుగా పేదరైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. నాగార్జునసాగర్ నిర్మాణానికై కమ్యూనిస్టు పార్టీలోని ఇతర నాయుకలతో కలసి పనుచేశారని అన్నారు. రేపల్లె నుంచి 1962, 1978లో రెండు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారని అన్నారు. ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై అనర్గళంగా స్పష్టంగా మాట్లాడేవారని అన్నారు. చేరుకపల్లి మండలంలో అప్పట్లోనే బుంగపోత రైతులకు సబ్సిడిపై కిరోసిన్ ఇప్పించారని, అనేక దళిత గ్రామాల్లో స్మశాన స్థలాలు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కొరరటాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్ళదామని అన్నారు. సభలో సిపిఎం నేతలు వై కిషోర్, కె గోపి, కె వెంకట్, కెవి లక్ష్మణరావు, కె ఆశ్విరాదం, కె రమేష్, జి దానియేలు, బి ఆగస్టిన్, ఎం వెంకటేశ్వరరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

బాపట్ల : కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ వర్ధంతి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కొరటాల చిత్ర పటానికి పూలమాల వేసి వాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, సిహెచ్ మజుందార్, శరత్, నాగేశ్వరరావు, సుభాని, సుభాషిణి పాల్గొన్నారు.



రేపల్లెలో కొరటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



బాపట్లలో కొరటాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం కృషి

- ఇంటింటికి తిరిగి పెన్షన్ల పంపిణీ
- అభివృద్ధి పనులు ప్రారంభం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన



పెన్షన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - మేదరమెట్ల

అభివృద్ధి, సంక్షేమం సమాన లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని అన్నారు. కొరిశపాడు మండలంలోని దైవాలరావూరులో ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, సైడ్ డ్రైన్స్ ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ కింద రూ.86.80లక్షలతో త్రాగునీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగుతుందని చెప్పారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం అధికారంలోనికి వచ్చిన తరువాత దీపం పథకం కింద అర్హులైన అందరికీ ఉచిత గ్యాస్, తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు చదువుతూ ఉంటే అందరికీ తల్లుల ఖాతాలో నగదు జమ చేసినట్లు చెప్పారు. 63లక్షల మందికి ఏడాదికి రూ.34 వేల కోట్లు పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికంగా రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకుని రూ.268 కోట్లతో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొరిసపాడు మండలంలో కూడా మరొక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్ రాజ్యలక్ష్మి, ఎంపిపి సాదినేని ప్రసన్నకుమారి, తహశీల్దారు జివి సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి రామ్మోహనరెడ్డి, ఎఇ ప్రసాద్, సర్పంచ్, అధికారులతో పాటు చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, జాగర్లమూడి జయకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని అనంతవరంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపిడిఒ పిటివి కృష్ణ పెన్షన్లు పంపిణీ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్స్ అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 93శాతం పెన్షన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వాళ్ళు ఎవరైనా ఉంటే రెండు రోజుల్లో పెన్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వే శ్యామ్, నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

వేమూరు : చుండూరు మండలం మున్నంగివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల లబ్ధిదారులకు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం అందజేశారు. పల్లె పండుగలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రు.34 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని చెప్పారు. అధికారంలోకి రాగానే పేన్షన్లు పెంపుదల, తల్లికి వందనం తోపాటు మిగతా పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. గత ప్రభుత్వంలో అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి పరచి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పంగులూరు : మండలంలో అర్హులైన లబ్ధిదారులు అందరికీ పింఛన్ల పంపిణీ చేసినట్లు స్పెషలాఫీసర్ అనంతరాజు తెలిపారు. పింఛన్ల పంపిణిని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్, పంచాయతీ సెక్రటరీ బి రాంబాబు ఉన్నారు.

మార్టూరు రూరల్ : రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఇసుక దర్శిలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించారు. ప్రముఖ వ్యాపారవేత్త విక్రమ్ నారాయణతో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు.



వృద్ధులకు పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



ప్రజలను పలకరిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

4న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పర్యటన

మార్కాపురంలో వాటర్‌గ్రిడ్‌కు శంకుస్థాపన చేయనున్న డిసిఎం

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ ఈ నెల 4న మార్కాపురం రానున్నారు. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ ఆనకట్ట వద్ద వాటర్‌గ్రిడ్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తరువాత మార్కాపురం పట్టణంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధికారులతో కలిసి సభా వేదిక కోసం పలు ప్రాంతాలను మంగళ వారం పరిశీలించారు. మార్కాపురం పట్టణ శివారులోని తర్లుపాడు రోడ్డులో శ్రీసాయి బాలాజీ హైస్కూల్ సమీపంలో గతంలో సిఎం చంద్రబాబు దిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మార్కాపురంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోనూ పరిశీలించారు. ఈ రెండు ప్రదే శాల్లో ఎక్కడైతే బాగుంటుందనేది ఇంకా తేల్చ లేదు. సభా వేదిక ఎక్కడ నిర్వహిస్తారనేది బుధ వారం వెల్లడించనున్నారు. సభా వేదిక కోసం స్థల పరిశీలనలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్, తహశీల్దారు కె.చిరంజీవి, జనసేన నాయకులు సయ్యద్ సాధిక్, బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి పివి క్రిష్ణారావు, టిడిపి నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, మార్కాపురం సిఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్‌ఐలు ఎం.సైదు బాబు, రాజ మోహన్‌రావు పాల్గొన్నారు.



పవన్‌కళ్యాణ్ పర్యటన కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కందుల

ప్రజాభిమానాన్ని చూరగొంటున్న 'ప్రజాశక్తి'

డిఎంహెచ్‌ఓ ఎస్.విజయమ్మ

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలిచి అక్షర యజ్ఞంలో ప్రజాశక్తి అందిస్తున్న వివిధ రంగాల ప్రత్యేక సంచికలు ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటున్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.విజయమ్మ అన్నారు. సమాజంలో ప్రజా అవసరాలను గుర్తించి ఆయా రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో ప్రత్యేక సంచికలు ప్రచురిస్తూ.. ప్రజాశక్తి ప్రజాభిమానాన్ని చూరగొంటోం దన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రచురించిన ప్రత్యేక సంచికను మంగళవారం వైద్యారోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ భిన్న రంగాల్లో విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ సామాన్య ప్రజలను సైతం ఆలోచింప చేసే విధంగా ప్రజాశక్తి అక్షర రూపంలో అందిస్తున్న సమాచారం అద్భుతంగా ఉంటుందన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రచురించిన డాక్టర్స్ డే ప్రత్యేక సంచిక వైద్యులకు కరదీపికగా ఉపయోగపడుతుం దన్నారు. వైద్యరంగంలోనే అనేక వైద్యులు అందించే వైద్య సహాయం, వైద్య సమాచారంతో కూడిన అనేక అంశాలు ఈ సంచికలో ప్రజాశక్తి ప్రచురించడం అభినందనీయమన్నారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సిద్దార్థ మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రచురించిన జాతీయ వైద్యుల దినోత్సవ ప్రత్యేక సంచిక వైద్యులకు ఒక డైరీలా ఉపయోగపడుతుం దన్నారు. వైద్యరంగానికి సంబంధించిన ఎంతో సమాచారం ఈ సంచికలో ప్రజాశక్తి పొందుపరిచిందన్నారు. డిసిహెచ్‌ఎస్ డాక్టర్ మోజేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రజలకు వైద్య రంగంలో అవసరమైన సమాచారాన్ని వైద్యుల వివరాలను అక్షర రూపంలో నిక్షిప్తం చేసి అందించడంలో ప్రజాశక్తి చేస్తున్న కషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ డి.రమేష్ బాబు, జిల్లా రిపోర్టర్ జయప్రకాష్, ప్రజాశక్తి విలేకరులు సుభాని, గోపి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలకు కట్టుబడి ఉన్నాం: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీల అమలుకు సిఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని, టిడిపి కార్యకర్తలు అధైర్యపడాల్సిన పనిలేదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కాపురం నియోజకవర్గంలోని టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో ఎమ్మెల్యే కందుల మంగళవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా కూడా అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, కిడ్నీ, కాలేయం, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు, పూర్తి వైకల్యంతో బాధపడుతున్న వారికి రూ.15 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. సామాజిక పింఛన్లు 65 లక్షల మందికి అందుతున్నాయన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని చెప్పారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం రూ.5కు భోజనం అందిస్తున్నారని తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రతి గ్రామ, వార్డు, బూత్ కన్వీనర్లు తమ పరిధిలోని గృహాలకు వెళ్లి చేసిన పనులు చెప్పాలన్నారు. కరపత్రాలు పంచాలన్నారు. ప్రతి కుటుంబం వద్ద ఫొటో దిగాలని, ఆ ఫొటోను టిడిపి యాప్‌లో పంపాలన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న వలిసాహెబ్

యర్రగొండ పాలెం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ వైద్యులు రోగులకు చేస్తున్న వైద్య సేవలను అభినందిస్తూ మంగళవారం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు షేక్ వలీసాహెబ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ నాయబ్ రసూల్ మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం కృష్ణారెడ్డి మాట్లాడారు. డుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా చేసిన బిసి రాయ్ జన్మదినం సందర్భంగా ప్రతియేటా జులై ఒకటో తేదీన డాక్టర్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు రోగులకు ప్రాణభిక్ష పెట్టేవారుగా అభివర్ణించారు. వైద్య వృత్తిలో రోజురోజుకూ గణనీయంగా అనేక మార్పులు వస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యులు రోగులకు భరోసా, కొండంత ఆశ అని అభివర్ణించారు. ఇంకా ఎస్‌ఎన్‌సియూ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దండే వెంకటేష్, న్యూరాలజిస్టు డాక్టర్ శ్యాం పెల్లి మాట్లాడారు. అనంతరం వీరిని ఘనంగా సన్మానించారు. డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి జాషువ, ప్రధాన కార్యదర్శి టి మస్తాన్‌రెడ్డి, కోశాధికారి పఠాన్ ఇస్మాయిల్‌ఖాన్, గౌరవాధ్యక్షులు షేక్ వలీసాహెబ్, గ్రామీణ వైద్యులు ఇ కోటి, వెంకటేశ్వర్లు, తిమోతి, బాలకోటి, నక్కా వెంకటేశ్వర్లు, సుబ్బరామయ్య, కాటంరాజు, సయ్యద్ మాబు, హనోక్, గుడిబండ్ల శ్రీనివాసరావు, హనుమంతరావు, పోలు నరసింహ, లింగబాబు, జయపాల్, వణుకూరి నాగేశ్వరావు, బట్టపోతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ సారీ కందిపప్పు లేనట్లే..

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలోని అన్ని రేషన్ షాప్ డీలర్లు జూలై నెలలో రేషన్ బియ్యం, చక్కెర ఇస్తున్నారు. ఈ నెలలో రెండు పండగలు వస్తున్నాయి. ఒకటి తొలి ఏకాదశి కాగా రెండోది పీర్ల పండగ. ఆదివారం తొలిఏకాదశి, సోమ వారం పీర్ల పండగ జరగనున్నాయి. అయితే ఈ పండగలకి రేషన్ బియ్యంతో పాటు కందిపప్పు ఇవ్వాలని ప్రభుత్వం సూచించినా క్షేత్రస్థాయిలో రేషన్ షాపుల్లో కందిపప్పు ఇవ్వడం లేదు. పైనుంచి మాకు ఇవ్వలేదని సాకులు చెబుతున్నా రని డీలర్లపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పేద ప్రజలు పండగపూటైనా పప్పు తిందామని అనుకుంటే, కందిపప్పు కూటమి ప్రభుత్వం సరఫరా చేయలేదంటూ డీలర్లు చెప్పడం పట్ల పేదలు నిరాశకు గురవుతున్నారు. ఒకపక్క చంద్రబాబు ప్రభుత్వం ప్రతి రేషన్ షాప్‌కి వెళ్లి పేద ప్రజలు రేషన్‌తో కందిపప్పు, చక్కెర, గోధుమపిండితో పాటు అన్ని సరుకులు తక్కువ ధరకే అందిస్తున్నామని చెబుతున్నారు. ఆగస్టు నెల నుంచయినా కంది పప్పు సరఫరా చేయాలని మండలంలోని పేద ప్రజలు కోరుతున్నారు.

సొసైటీ ఆవరణలో మొక్కలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు సిండికేట్ రైతు సేవా సహకార సంఘం ప్రాంగణంలో మంగళవారం మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాలను సొసైటీ ఎండి ఎం శంకర్ ప్రసాద్, సొసైటీ పర్సన్ ఇంచార్జ్ ఎన్ సురేంద్రబాబు పర్యవేక్షించారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా సొసైటీ ప్రాంగణంలో ఈ మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మళంపాడు టిడిపి అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

భిక్షాటన చేస్తూ నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని కాంట్రాక్ట్ కార్మికులు నిరసనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఆందోళనకు దిగారు. మార్కాపురం మున్సిపాలిటీలోనూ కార్మికులు ఆందోళనబాట పట్టారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మార్కాపురం పట్టణంలో భిక్షాటనతో మంగళవారం నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21 వేల జీతం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగ విరమణ తరువాత బెనిఫిట్స్‌గా రూ.2 లక్షలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ విమరణ వయోపరిమితి 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఉద్యోగ కాలంలో మరణించిన కార్మికుడి కుటుంబంలోనే మరొకరికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతోందని, ఈ నెల 4వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి పి రూబెన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మార్కాపురం అధ్యక్ష కార్యదర్శులు కె సుబ్బరాయుడు, గొట్టం హరికృష్ణ, షేక్ ఇమాంషా, ఎ శేషయ్య, జి వెంకటేశ్వరరెడ్డి, అందె చిన్న నాసరయ్య, డి చెన్నరాయుడు, జి అల్లూరయ్య, బత్తుల సుబ్బారెడ్డి, కె వెంకటేశ్వరరెడ్డి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం రాచర్ల పట్టణం పేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం రాచర్ల మండల విద్యాశాఖ అధికారులు వి గిరిధర శర్మ, షేక్ మైనుద్దీన్‌లు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల పుస్తకాలు, నోటు పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థుల చదువు పట్ల ఆరా తీశారు. వారు చెప్పిన సమాధానాల పట్ల ఎంఈఓలు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి వెంకటేశ్వర్లు విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల గురించి అడిగారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో బిసి కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాలలోనూ మద్దిపాడు మండలంలోని శిక్షణ ఇస్తున్న కేంద్రాలలో ఆయన పరిశీలించారు. సుమారు 3 నెలలుగా నిర్వహిస్తున్న శిక్షణపై, ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. శిక్షణా కాలంలో కుట్టిన దుస్తులు పరిశీలించి మెరుగైన ఉపాధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రాలలో సదుపాయాలు కల్పించాలని సూచించారు

అర్ధవీడులో ఓ మోస్తరు వర్షం

ప్రజాశక్తి-అర్ధవీడు

అర్ధవీడు మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజుల నుంచి వాతావరణం చల్లబడటంతో రైతులు వేసిన పత్తి, ఆముదాల పంటలకు నీళ్ల కట్టవలసిన అవసరం లేకపోవడంతో రైతులు ఆనందపడుతున్నారు. ఉరుములు, మెరుపులు లేకపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగలేదని స్థానిక ప్రజలు తెలిపారు. అలానే మండలంలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.

రోటరీ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ గత కార్యవర్గం నుంచి నూతన 2025-26 కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీ క్రాంతి నర్సింగ్ హోంలో జరిగిన ప్రమాణ స్వీకార సభలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ పణీంద్ర బాబు ఆధ్వర్యంలో నూతన అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి సమక్షంలో గత ప్రెసిడెంట్ చప్పిడి వీరయ్య నుంచి రోటరీ క్లబ్ కొత్త ప్రెసిడెంట్ బాచిన శివధర పూర్ణచంద్రరావుకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులైన పూర్ణచంద్రరావు, అళహరి హరి ప్రసాద్, చామర్తివెంకట గురు శేఖర్, మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, పుట్టంరాజు శ్రీ రామ చంద్రమూర్తి, డాక్టర్ ఖాజా వలి, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, సంకా బాబు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, గుంజి హనుమంతరావు, చిన్ని కామేశ్వరరావు పాల్గొన్నారు.

పర్చూరు : రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించినట్లు రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక రోటరీ భవన్లో నిర్వహించిన సభలో 2025 - 26 సంవత్సరానికి రోటరీ క్లబ్ కార్యవర్గ ఎన్నిక జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న కార్యవర్గాన్నే తిరిగి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షునిగా తోకల కృష్ణమోహన్, కార్యదర్శిగా కోమటి ఆంజనేయులు, కోశాధికారిగా వంటి సదానందరెడ్డి ఎన్నికైనట్లు చెప్పారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను వినియోగించుకొని ప్రజలు ఆరోగ్య వంతులుగా తయారు కావాలని ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా గ్రామంలోని జెడ్పి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమబెంగాల ద్వితీయ ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతి జూలై 1న జాతీయ డాక్టర్స్ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ శ్రుతి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని నాయుడువారిపాలెం పంచాయతీలో ఇటీవల గుండె పోటుతో మృతిచెందిన తెలుగుదేశం కార్యకర్త పెంట్యాల శ్రీధర్ (46) కుటుంబాన్ని సర్పంచి గుమ్మడి సీత మహాలక్ష్మి, టిడిపి నాయకులు గుమ్మడి రామ్మోహనరావు మంగళవారం పరామర్శించారు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న భార్య లావణ్య, ఇద్దరు చిన్నారులను ఓదార్చారు. అప్పులు చేసి వ్యవసాయం చేసినా గత కొన్నేళ్లుగా కలిసి రాక ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడికి గురై భర్తను కోల్పోయానని భార్య లావణ్య కన్నీటి పర్యంతం అయ్యారు. మృతుని కుటుంబానికి పార్టీ ఉంటుందని, తమ శక్తి కొలది అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచి భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో ఉపసర్పంచి నాయుడు సుబ్బారావు, నాయుడు మధుసూదనరావు, నర్రా భూషయ్య, నాయుడు మోహనరావు ఉన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు

చిమ్మిరిబండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఫౌండర్ విద్యా వికాస్ సంస్థ తరపున రూ.10వేల విలువైన పాలిటెక్నిక్ ఎన్ఎంఎస్ ఇంగ్లీష్ గ్రామర్ అట్లాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. చవిటిపాలెం హెచ్ఎం డి డేవిడ్, విద్యా వికాస్ ఫౌండర్ జి కోటేశ్వరరావు, చిన్నారిబండ పాఠశాల హెచ్ఎం కె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు హెల్మెట్లు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని 21 గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు హెల్మెట్లు మొదలైన వస్తువులను డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్ మంగళవారం అందజేశారు. మండలంలో 55 మంది పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి హెల్మెట్, 2 గ్లౌజులు, 5మాస్కులు, 1జాకెట్, బూట్లు అందజేశారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన



మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పురపాలక కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి మంగళవారం నిరసన తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి చిమటా వీరాస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం వాగ్దానం చేసిన డిమాండ్లను నెరవేర్చాలనే కోరుతూ దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వహయాంలో జరిగిన 17 రోజుల సమ్మెకు సంబంధించిన జిఒలు విడుదల చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్నారు. జిఒ నెం 36 ప్రకారం రూ.24500 వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ అమలుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, పి సురేష్, చాంద్ భాషా, కొండయ్య, కాంతారావు, గూడూరు క్రాంతి, విశ్వేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

బాపట్ల : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన మంగళవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన అనంతరం జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ఆప్కాస్‌లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి 'తల్లికి వందనం' పథకం వర్తింప చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో చేసిన 17 రోజుల సమ్మెకు సంబంధించిన జిఒలు విడుదలచేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె శరత్, యూనియన్ నాయకులు హరిబాబు, అంకారావు, రత్నం, నాని, నిర్మల పాల్గొన్నారు.

రేపల్లె : ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం మోకాళ్లపై నిరసన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఎస్ రవిబాబు మాట్లాడారు. గతేడాది కార్మికులు 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రేపల్లె అధ్యక్షులు డి ప్రభాకరరావు, ఎస్ రవి, కె రాఘవేంద్రరావు, శివ, రవి, శ్రీను, గీత, అనూష, సిఐటియు నాయకులు కె ఆశీర్వాదం పాల్గొన్నారు.



బాపట్ల కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు



రేపల్లెలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

కౌలు రైతులు సాగు ధృవపత్రం పొందాలి

ప్రజాశక్తి - చీరాల

కౌలు రైతులు సాగు ధృవీకరణ పత్రాలు పొందాలని ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పంట సాగు దారుల చట్టంపై ప్రచార కార్యక్రమాన్ని ఆయన మంగళ వారం ప్రారంభించారు. చీరాల, వేటపాలెం మండలాల్లో జరగనున్న ప్రచార కార్యక్రమంలో సిసిఆర్సిపైన కౌలు రైతులకు అవగాహన కల్పించి ఈ చట్టంపై భూ యజమాను నులకు ఉన్న అపోహలు తొలగించుటకు దోహదపడు తుందని ఆకాంక్షించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ భగవాన్ దాస్, నాదెండ్ల కోటేశ్వరరావు, వివిధ సచివాలయాల సిబ్బంది, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఒ చంద్రశేఖర్ నాయుడు

సంతమాగులూరు : రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప, కంది పైర్లకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పంట భీమా నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి షేక్ సైదా తెలిపారు. మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులను సంబంధిత విఆర్‌ఒలకు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో విఎఎ ఎస్ రవికిరణ్, అఖిల్ పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని ఎదుబాడు, తన్నీరువారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె భాస్కరరావు మాట్లాడుతూ పొగాకు అమ్ముకోవడానికి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం వివరించారు. పొగాకు చెక్కుల్లో 20 శాతం కన్నా తక్కువ తేమ ఉండే విధంగా చూసుకొని అడుగు ఆకు, మధ్య ఆకు, పై ఆకులను గ్రేడింగ్ చేసుకొని విడివిడిగా ఉండే విధంగా చెక్కులు తీసుకొని రావాలని వివరించారు. ఈ ఏడాది పొగాకు పంట వేయవద్దని, ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శెనగ, జొన్న పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ వై శ్రీకాంత్, ఎంపిఇఒ లావణ్య, సర్పంచి ఆళ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని క్రాప, రావికింపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఎఒ వి నరేంద్రబాబు మంగళవారం నిర్వహించారు. వరి పంట నందు కలుపు నివారణపై రైతులు అవగాహన కల్పించారు. వరిలో కలుపు మొక్కలు నియంత్రించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీలాం శివ రత్నకుమారి, ఎఇఒ ఎం ప్రభాకరరావు, బిఎస్ వంశీ పాల్గొన్నారు.

పంగులూరు : రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, అపరాలు, పత్తి, సాగు పై దృష్టి సారించాలని ఎఒ డి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని రేణింగవరం, కస్వాపురం గ్రామాల్లో రైతులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో నారాయణస్వామి, విఎఎ శివాని పాల్గొన్నారు.

మహిళా సర్పంచులు స్వతంత్రంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

మహిళా సర్పంచులు విధినిర్వాహణలో స్వతంత్రంగా వ్యవహరించాలని ఈటిపిఆర్డి, శిక్షకులు కొండపి రఘుబాబు పేర్కొన్నారు. మహిళా నాయకత్వంలో మార్పు - స్థానిక స్వపరిపాలనలో సాధికారిత అను అంశంపై చినగంజాం, కారంచేడు, పర్చూరు, వేటపాలెం, ఇంకొల్లు, చీరాల, యెద్దనపూడి మండలాలకు చెందిన 42 మహిళా సర్పంచులకు స్థానిక ఎంఆర్‌సి భవనంలో రెండో రోజు శిక్షణ మంగళవారం నిర్వహించారు. 'మేమంతా నిన్నెన్ను కున్నాం, నీపై ఆశలు పెట్టుకున్నాం' అనే పాట ద్వారా మహిళా సర్పంచులు నిర్భిత్తంగా విధులు నిర్వహిస్తే ఆ గ్రామ ప్రజలు ఎదుర్కొను సమస్యలు, 'వైకుంఠ పాళీ' ఆట ద్వారా మహిళా సర్పంచులు ఏఏ నిర్ణయాలు తీసుకొనకూడదో వివరించారు. ప్రజాస్వామ్య నాయ కత్వం వైపు ఎల్లవేళలా మొగ్గు చూపగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, మహిళా సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎ బి ఎఫ్రాయం

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

పొగాకు పంటకు ప్రత్యామ్నయంగా జొన్న, మొక్కజొన్న, అపరాలు సాగు చేసుకోవాలని, పొగాకు సాగు చేయొద్దని ఎడిఎ బి ఎఫ్రాయం రైతులకు సూచించారు. మండలంలోని వేంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పొగాకు సాగు చేయవద్దని చెప్పారు. వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, విఎఎ శేషయ్య, ఎఇఒ కోటేశ్వరరావు, రేణుక పాల్గొన్నారు.

ఇంకొల్లు : రైతులు ఖరీఫ్ తోపాటు రబీలోనూ వివిధ పంటల సాగుకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఎం మేరెమ్మ అన్నారు. మండలంలోని పూసపాడు, హనుమోజిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది మంగళవారం నిర్వహించారు. పూసపాడు గ్రామ ఉద్యాన సహాయకులు కిషోర్, హనుమోజిపాలెం విఎఎ పాల్గొన్నారు.

ప్రజా రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపేందుకు సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలని ప్రజా రవాణా జిల్లా అధికారి డిడి సామ్రాజ్యం సిబ్బందికి సూచించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన డిపిటిఒ సామ్రాజ్యంను మంగళవారం ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, ఫెడరేషన్ అధ్యక్షులు మున్నంగి కుమార్, జిల్లా కార్యదర్శి పి తిరుపతిరెడ్డి, కోశాధికారి బి శ్రీనివాసరావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, యోగానంద్, ఒంగోలు డిపో నాయకులు శ్రీనివాసరావు, ఉయ్యూరు శ్రీనివాసరావు, రాంబాబు ఉన్నారు.



డిపిటిఒకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న ఆర్టీసీ నాయకులు

ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

ప్రజాశక్తి - బాపట్ల


వేగేశన నరేంద్ర వర్మ

నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తమ ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మొదటి ఏడాదిలో నేర్చుకోవడమే సరిపోయిందని అన్నారు. పాలనలో వెనుక బడ్డారని, రానున్న నాలుగేళ్లలో అద్భుత పాలన అందిస్తామన్నారు. గ్రామీణాభివృద్ధి, రహదారులు, దేవాదాయ, పర్యాటకంగా అభివృద్ధిపై దృష్టి పెట్టి నిధులు తెచ్చి పనులు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు లేకుండా టెండర్లు పిలిచి ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 కోట్లు మంజూరు కావాలంటే మున్సిపల్ ఎన్నికలు జరిగి కౌన్సిల్ ఏర్పాటైతేనే సాధ్యమని అన్నారు. రూరల్ పరిధిలోని పంచాయతీలను విలీనం చేసిన నేపథ్యంలో పురపాలక సంఘం ఎన్నికలు నిలిచిపోయాయని అన్నారు.


శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిఐ సుబ్బారావు

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

ప్రజాశక్తి- చీరాల

శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని, ప్రతి ఒక్క మహిళ, విద్యార్థిని మొబైల్‌లో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని సిఐ సుబ్బారావు సూచించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, శక్తి బృందాలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీ మేధావి జూనియర్ కళాశాల్లో డైరెక్టర్ ఎంవి దుర్గ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శక్తి యాప్, శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 గురించి వివరించారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ రాజ్యలక్ష్మి, సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు ఎస్ఐ పి జనార్ధన్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. 10వ తరగతి బాల, బాలికలతో మాట్లాడారు. యుక్త వయసు వచ్చిన బాలికలు పాఠశాలల్లో, కాలేజీల్లో, వాట్సాప్ వీడియో ఫోన్ల ద్వారా మాయ మాటలకు, ఆకర్షణలకు లోనై ఏ విధంగా మోసాలకు, బ్లాక్ మైలింగ్‌కు గురవుతున్నారనే విషయాలను వివరించారు.

వర్మికంపోస్టు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పోలూరులో ఎంపిడిఒ పిటివి కృష్ణ సంపద ఉత్పత్తి కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్ల వెంట వేయకుండా ఇళ్ల దగ్గరికి వచ్చే పంచాయతీ సిబ్బందికి ఇచ్చి రిక్షాల్లో వేసి సంపద ఉత్పత్తి కేంద్రానికి పంపాలని అన్నారు. అక్కడ చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చి సంపద సృష్టించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని అర్థం చేసుకుని సంపద ఉత్పత్తి కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయపాటి సీతయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అద్దంకి మండలం రెడ్డిపాలెంకు చెందిన చిన్నమ్మాయి తన భర్తతో కలిసి బైక్‌పై వెళుతుండగా మార్టూరు సమీపంలోని యలవర్తి కోల్డు స్టోరేజీ సమీపంలోకి రాగానే కాళ్లు పెట్టుకునే స్టాండ్ ఒక్కసారిగా విరిగిపోవడంతో బైక్‌పై నుండి క్రింద పడి తీవ్రంగా గాయపడ్డట్లు 108 సిబ్బంది మనోహర్ తెలిపారు. సమాచారం అందుకున్న 108సిబ్బంది చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు.

కార్మిక హక్కులు కాపాడుకొనేందుకు

యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-పామూరు


మాట్లాడుతున్న హనీఫ్

కార్మిక హక్కులు కాపాడుకునేందుకు యువత ముందుకు రావాలని సిఐటియు జిల్లా మాజీ నాయకులు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. సోమవారం ట్యాక్సీ యూనియన్ల సమావేశం పప్పువెంకోబ్ రావు మీటింగ్ హాల్లో కే మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాల రాస్తు ధనవంతులకు అనుకూలంగా చట్టాలను అమలు చేసుకుంటున్నారని అన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేస్తున్నారని కార్మికులందరూ ఐక్యమై వారి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయి తప్ప కార్మికుల జీతాలు పెరగలేదని తెలిపారు. కార్మికుల ఐక్యతను దెబ్బ దెబ్బ కొట్టడమే బిజెపి ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యని ఆరోపించారు. ఈనెల తొమ్మిదో తేదిన దేశవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కులు సాధించుకునే అంతవరకు యువత ఐక్యంగా ఉండి పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టాక్స్ డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రహదారుల వెంట ఆక్రమణల తొలగింపు


పోలీసుల ఆధ్వర్యంలో ఆక్రమణ తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు, బ్రాహ్మణ కోడూరు రోడ్డులో రహదారి వెంట దుకాణాల ఆక్రమణలు తొలగించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో అధికారులు ఆక్రమణలు మంగళవారం తొలగించారు. స్థానిక బౌద్ధ స్తూపం ఎదురుగా ఉన్న చికెన్ స్టాలు, దాని పక్కన ఉన్న మరోక షాపును జెసిపితో తొలగించారు. ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, పాదాచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా తక్షణమే తొలగించాలని ప్రజల విజ్ఞప్తి మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తహశీల్దారు మేక శ్రీనివాసరావు తెలిపారు. భట్టిప్రోలు, వెల్లటూరు రహదారి కూడా ఆక్రమణకు గురైందని, ఈ ఆక్రమణలు తొలగిస్తే రహదారిని విస్తరించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. షాపుల యజమానులు అడ్డుపడకుండా శాంతి భద్రతల దృష్ట్యా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, పంచాయతీ అధికారులు పోలీసులు సహకారంతో ఆక్రమణ తొలగించారు. బౌద్ధ స్తూపం ఎదురు తొలగించిన ఆక్రమణల వెనుక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, దీని దృష్ట్యా ఆక్రమణ తొలగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్న క్యాంటీన్ నిర్మించనున్నట్లు చెప్పారు.

ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగించారు

స్థానిక బౌద్ధ స్తూపం ఎదురుగా ఉన్న చికెన్ స్టాల్‌ను పోలీసులు సహకారంతో అధికారులు తొలగించారు. ఈ చికెన్ స్టాలును వైసిపి నాయకుడు పప్పుల గ్రేట్ అరుణ శాస్త్రి ఏర్పాటు చేశాడు. రహదారి విస్తరణ కోసం ఆక్రమణలు తొలగిస్తే ఉన్న ఆక్రమణలు మొత్తం తొలగించాలికాని తనకు చెందిన దుకాణాన్ని మాత్రమే ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. తాను వైసిపి కార్యకర్తగా పనిచేస్తున్నాననే అక్కస్సుతో టిడిపి నాయకులు అధికారులతో కుమ్మక్కై తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన తనకు రూ.2లక్షలపైగా ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.


అడ్డుకున్న వ్యక్తిని తీసుకు వెళుతున్న పోలీసులు


పెన్షన్ అందజేస్తున్న ఎంఎల్ఎ దామచర్ల జనార్ధన్

పేదలకు వరం పింఛన్లు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. మంగళవారం ఉదయం నగరంలోని 49వ డివిజన్ సత్యనారాయణపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులలకు ఆర్థిక భరోసా అందించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్ రూ.3వేలు నుంచి రూ.4వేలకు పెంచి ప్రతినెల 1నే అందించడంపట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొదటి రోజునే 100 శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందన్నారు. టిడిపి నగర అధ్యక్షులు బండారు మదన్, మాజీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావు

ప్రజల భద్రతకు జన సురక్ష పథకం

ప్రజాశక్తి - కర్లపాలెం

ఖాతాదారులుగా ఉన్న వారికి, నూతనంగా చేరే వారికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనసురక్ష పథకం ప్రజలకు ఆర్థిక పరమైన భద్రత ఇస్తుందని ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో ఎల్డిఎం శివ కృష్ణ అధ్యక్షతన మేనేజర్ కె మానస ఆధ్వర్యం లో జన సురక్ష పథకంపై మంగళవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జన సురక్ష పథకంలో 18 నుండి 70ఏళ్ల వయసు వారికి పిఎంఎస్‌బివై పథకం రూ.20కే ప్రమాద బీమా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్లపాలెం సర్పంచ్ నక్కా లలిత కుమారి, ఎల్డిఎం శివ కృష్ణ, ఆర్ఎస్ఇటి డైరెక్టర్ బెనర్జీ, యూనియన్ బ్యాంక్ సిబ్బంది అనీషా, భాను, శ్రీనివాసరావు, జగదీష్, గోపి, స్రవంతి, సందీప్, ప్రసాద్, సిఎస్ఎల్ సిబ్బంది మహేంద్ర, మమత, శ్రీను పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న సివిల్ జడ్జి శాంతి

లోక్ అదాలత్‌పై సమీక్ష

ప్రజాశక్తి - పర్చూరు

రాజీ పడదగే క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పి శాంతి తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంకొల్లు సిఐ వైవి రమణయ్య, కారంచేడు, ఇంకొల్లు ఎస్ఐలు ఖాదర్ బాషా, జి సురేష్ పాల్గొన్నారు.

అఖిలేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ వాది పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ జన్మదిన వేడుకలు మేధ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, విలియం బూత్ కళాశాల ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, అంజుమన్ కమిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం, కాంగ్రెస్ శరత్ కుమార్, మోర్ల చిన్న వెంకటేశ్వర్లు, బత్తుల వీరయ్య, బోయిన సూరిబాబు, దర్శి భాస్కరరావు, జిల్లా పోగు నాగరాజు, ఎస్ జానీ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

'తల్లికి వందనం' పథకంపై నియోజకవర్గం స్థాయిలో విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భట్టిప్రోలు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఎంఈఓ నీలం దేవరాజ్ తెలిపారు. వక్తృత్వంలో సూర్యపల్లి విపి అండ్ జిఎస్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎరగల మౌనిక ప్రథమ స్థానం, పాటల పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఫలపల నిహారిక ప్రథమ స్థానం, వాకా చంద్రశేఖర్ తృతీయ స్థానం, చిత్రలేఖనంలో పల్లెకోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సిద్ధకుమార్, చంద్రహాస్ ప్రథమ స్థానం, సూరేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని సిహెచ్ స్వరూప ద్వితీయ స్థానం, వ్యాసరచనలో సూర్య పల్లి పాఠశాల విద్యార్థిని వై హేమశ్రీ ద్వితీయ స్థానం, కథల పోటీల్లో పల్లెకోన పాఠశాల విద్యార్థిని జి భూమి శ్రీ తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు.

చెక్‌పోస్టులో ఎఎంసి చైర్మన్ తనిఖీ

ప్రజాశక్తి - వేమూరు


చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ పూర్ణ కుమారి

చుండూరు మండలం బ్రాహ్మణ కోడూరు మార్గంలోని వెల్లటూరు వద్ద ఉన్న చెక్ పోస్టును వేమూరు ఎఎంసి చైర్మన్ గుత్తిపాటి జయ వెంకట పూర్ణ కుమారి మంగళవారం తనిఖీ చేశారు. మార్కెట్ యార్డు ప్రక్షాళనలో భాగంగా చెక్‌పోస్టులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పొన్నూరు, గుంటూరు ప్రధాన రహదారి మార్గంలో ఉన్న ఈ చెక్ పోస్టుకు వాహనాల రద్దీ ఉంటుందని అన్నారు. నిరంతరం మార్కెట్ యార్డ్ పరిధిలోని చెక్ పోస్టులను పర్యవేక్షిస్తూ ఉంటానని చెప్పారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - నగరం

మండలంలోని వెలమవారిపాలెం సపోటా తోటలో పేకాట వారిపై ఎస్ఐ బండ్ల భార్గవ్ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10మందిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.32200 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ 2 సెంట్ల స్థలం

- వైసిపి హయాంలో ఇచ్చిన 13 వేల పట్టాలు బోగస్..
- నియోజకవర్గంలో రూ.117 కోట్లతో అభివృద్ధి పనులు
- నేటి నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు'
- ప్రెస్‌మీట్‌లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో అర్హులైన ప్రజలందరికీ రెండు సెంట్ల చొప్పున స్థలాలు కేటాయిస్తామని, వైసిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 13 వేల పట్టాలు బోగస్‌గా తేలాయని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. టిడ్కో గృహాలను త్వరగా పూర్తి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడారు.

రూ.117 కోట్లతో అభివృద్ధి పనులు

ఒంగోలు నియోజకవర్గంలో తొలి ఏడాది రూ.117.2 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మ్యాచింగ్ గ్రాంట్‌తో సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. రూ.89 కోట్లతో అంతర్గత రహదారులు, సిసి రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.480 కోట్లతో ఒంగోలు నగరంలో ప్రతి రోజు మంచినీరు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పోతురాజు కాల్వ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

ఒంగోలు నగర సుందరీకరణ, పార్కులు, డివైడర్ల అభివృద్ధి, డ్రైనేజీలలో పూడికతీతకు స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు, ట్రంక్ రోడ్డు, కొత్తపట్నం రోడ్ల విస్తరణను త్వరలోనే చేపడతామని, రోడ్ల విస్తరణతో షాపులు, ఇతర సముదాయాలు కోల్పోయే వారికి సాయంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కొత్తపట్నంలో పోర్టు, హార్బర్ అభివృద్ధి, విమానాశ్రయం ఏర్పాటు పనులు వేగవంతం చేస్తామన్నారు.

కూటమిని విమర్శించే అర్హత వైసిపికి లేదు

వైసిపి ప్రభుత్వం నవరత్నాలు పేరిట ప్రజలను మోసం చేసిందని, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసిపి నేతలకు లేదని ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు. జగనన్న కాలనీలు శ్మశానాలలో ఇచ్చారని, వైసిపి నాయకులు, కార్యకర్తలే లబ్ధిపొందారన్నారు.

నేటి నుంచి సుపరిపాలన తొలి అడుగు

ఒంగోలు నియోజకవర్గంలో గడప గడపకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఈ నెల 2 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు. రోజుకి 30-50 ఇళ్లకు తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు వివరించటంతో పాటు వైసిపి హయాంలో జరిగిన దురగతాలు ప్రజలకు వివరిస్తామన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ పాడి రైతులకు అండగా ఉంటామని, వారిని ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, బిజెపి నాయకులు శ్రీనివాసరావు, టిడిపి నేతలు శింగరాజు రాంబాబు, టివి శ్రీరామ్మూర్తి, కామేపల్లి శ్రీనివాసరావు, శశికాంత్ భూషణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో పలు చోట్ల పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 2న సాయంత్రం 6.30 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. ఈ నెల 3న ఉదయం 10.30 గంటలకు కొండపి నియోజకవర్గంలో పలు గ్రామాలలో జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలసి పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు ఒంగోలు ప్రకాశం భవన్ లోని కలెక్టర్ కార్యాలయంలో మామిడిపాలెం, అన్నవరప్పాడులోని గుడిసె వాసులు నివాసం వుండే రైల్వే స్థలానికి మార్కెట్ విలువ నిర్ణయంపై జిల్లా, రైల్వే అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామం వద్ద జలజీవన్ మిషన్ పథకంలో జిల్లాలో 18 మండలాలలోని 578 గ్రామాలలో ఇంటింటికి కుళాయి ఏర్పాటుపై జరిగే శిలాఫలకం ఆవిష్కరణ, పలు అభివద్ధి కార్యక్రమాలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌తో కలిసి పాల్గొంటారు. ఈనెల 5న ఉదయం 9 గంటలకు రాచర్ల మండలం జెపి చెరువు గ్రామంలో నెమిలిగండ్ల రంగనాయకస్వామి వారి దేవస్థానంలో పూజా కార్యక్రమం, దేవస్థాన అభివద్ధిపై అటవీ శాఖ అధికారులతో జరిగే సమావేశంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డితో కలసి పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు గిద్దలూరు నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు, ముత్తుముల అశోక్ రెడ్డి ఏర్పాటు చేసే పలు కార్యక్రమాలలో పాల్గొంటారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

8 కిలోల గంజాయి స్వాధీనం

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వారి సిబ్బంది, ఇఎస్‌టిఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్, వారి సిబ్బంది తనిఖీలు చేస్తుండగా.. ఒంగోలు రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఏబీఎం కాలేజీ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ వద్ద, చిత్తూరు జిల్లాలోని నగరి మండలానికి చెందిన ఎస్.మణి అనే వ్యక్తి నుండి 8 కిలోల గంజాయి గుర్తించారు. గంజాయి కలిగిన బ్యాగ్‌ను సీజ్ చేశారు. సదరు మణిని ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులలో ఒంగోలు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ.లీనా, సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.గీత, వారి సిబ్బంది, ఇఎస్‌టిఎఫ్ ఎస్ఐ, పి.రవి, ఆంజనేయులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి-సంతనూతలపాడు

నైట్ రౌండ్ సందర్భంగా ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు వాహన తనిఖీలు చేపడుతుండగా సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద రాత్రి సమయంలో ఆటో డ్రైవర్ వడాల నాగరాజు మద్యం సేవించి.. ఆటో నడుపుతూ పట్టుబడ్డారు. ఆయనను ఒంగోలులోని కోర్టులో హాజరుపరచగా.. అతనికి కోర్టు పది వేల రూపాయలు జరిమానా విధించింది. అదేవిధంగా నిర్లక్ష్యంగా, అధిక లోడుతో వెళుతున్న, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా వెళుతున్న గ్రానైట్ రాళ్లు, పెద్ద పెద్ద రాళ్ల లైసెన్స్ లేకుండా తోలుతున్న రెండు ట్రిప్పర్ డ్రైవర్లపై కూడా కేసులు పెట్టినట్లు సిఐ శ్రీకాంత్ తెలిపారు. వారికి ఒక్కొక్కరికి సరాసరి 50 వేల రూపాయల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.



గిరిజన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గిరిజన భవనాన్ని అభివృద్ధి చేస్తా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని గిరిజన భవనాన్ని ఆయా సామాజిక వర్గాల సంస్కృతి ప్రతిబింబించేలా అన్ని విధాలుగా అభివద్ధి చేస్తామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ఆమె గిరిజన భవనాన్ని సందర్శించారు. ప్రాంగణం మొత్తం కలియ తిరిగి ఇందులోని వసతులను పరిశీలించారు. వాటి స్థితిగతులను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. మున్సిపాలిటీ నుంచి నీటి కనెక్షన్ కావాల్సి ఉందని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, భవనంలో ఏసిలు, ఇతర ఫర్నిచర్ అవసరం ఉందన్నారు. అదేవిధంగా భవనం వెనక వైపునకు జిజిహెచ్ (రిమ్స్) ప్రాంగణంలో నుంచి ప్రవేశించేలా ఒక గేటును కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వీటికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు అందించారు. కలెక్టర్ స్పందిస్తూ ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీల దినోత్సవం ఉందని, ఈలోగా ఈ భవనాన్ని ఆధునీకరించి అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ కుమార్, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్ ఐసయ్య, ఏపిఈడబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌బాబు, ఒంగోలు తహశీల్దార్ పి.మధుసూదన్‌రావు, ఇతర అధికారులు ఉన్నారు.



మేయర్ సుజాతకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మేయర్ గంగాడ సుజాత జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శింగరాజు రాంబాబు, టివి శ్రీరామ్మూర్తి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు మదన్, బొడ్డపాటి వెంకట్, కొఠారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉపాస్'లో ఘనంగా డాక్టర్స్‌డే

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



సన్మానిస్తున్న ఉపాస్ వైద్యులు

ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే మరియు చార్టెడ్ అకౌంటెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రరావు (రాంబాబు), డాక్టర్ విజయగౌరి, ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతిచౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్స్ బాల మరియు కూరపాటి సుబ్బారావు డాక్టర్ రామచంద్రరావు మరియు డాక్టర్ విజయగౌరిని ఘనంగా సన్మానించారు. ఉమ్మడి ప్రకాశం వాసులకు వారు చేస్తున్న వైద్య సేవలను కొనియాడారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్స్ బాల, కూరపాటి సుబ్బారావుని ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ పూలమాలలతో సన్మానించారు. ఒంగోలు చార్టెడ్ అకౌంటెంట్స్ మధుసూదనరావు, ఎం.వి.విజయ్‌కుమార్, తిరువాయు కుమార్, జగన్ మోహన్, చైతన్య రెడ్డి, కష్ణ కిషోర్, సుధీర్ కుమార్, అనిల్‌కుమార్, ఉపాస్ హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ చివుకుల, డాక్టర్ పోకూరి శ్రీనివాస్, జయవర్ధన్ ఉల్చి, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డాక్టర్ సువర్ణరాజు, డాక్టర్ రాధ, డాక్టర్ పవన్ కుమార్ కె, డాక్టర్ మహేష్ వేమవరపు, ఆర్థో ఫిజియో అసిస్టెంట్ డాక్టర్ జగదీశ్, జనరల్ మేనేజర్ బిఎన్.ఆనంద్ కుమార్, సిఎ రాజేష్ మాడిశెట్టి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ మెరుగైన సంక్షేమం

- అభివృద్ధికి పర్యాయ పదం కూటమి ప్రభుత్వం
- మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు కూటమి ప్రభుత్వం మెరుగైన సంక్షేమం అందిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలం, పొందూరులో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి స్వామి మాట్లాడారు. పేద పిల్లల చదువు కోసం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామన్నారు. మహిళలకు ఉచితంగా



పింఛన్ అందజేస్తున్న మంత్రి స్వామి

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమానికి మన ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ లక్ష్మీప్రసన్న, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపిడిఒ దేవసేనకుమారి, టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, పొందూరు సర్పంచి పిల్లి కోట్లింగం, ఎంపిటిసి పమిడి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు ఏరువ ఆనందరావు, శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య, యస్ఐ నాగమల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.